కొత్త పింఛన్లు మంజూరయ్యేనా..?

- ఆశల పల్లకీలో అర్హులు
- దరఖాస్తులతో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఓపెన్ కాని వెబ్‌సైట్



వాడపాలెం గ్రామ సచివాలయం

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరు అంశాన్ని గాలికొదిలేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా ఇంత వరకూ కొత్త పింఛన్లపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకుండా తాత్సారం చేస్తోంది. భర్త చనిపోయిన వితంతువులు, పింఛను తీసుకుంటున్న భర్త చనిపోగా 60 ఏళ్ల వయసు కలిగిన భార్యలు, దివ్యాంగులు తదితర సామాజిక పింఛనుకు కొత్తగా అర్హత కలిగిన వారందరూ గత మూడు నెలలుగా దరఖాస్తులు పట్టుకుని పింఛను కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా కొత్తగా దరఖాస్తు పెట్టుకుందామని అనేకమంది రోజూ సచివాలయాల చుట్టు తిరగడం, వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది సమాధానం ఇవ్వడం, దాంతో వారు నిరాశతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. తాము అధికారంలోకి వస్తే 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు.

గత ప్రభుత్వంలో ప్రతి 6 నెలలకు కొత్త పింఛన్లు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి వెంటనే 65 ఏళ్ల అర్హత వయసును 60 ఏళ్లకు తగ్గించింది. ఆ మేరకు అర్హత కలిగిన వారందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద పింఛన్లు మంజూరు చేసింది. అంతటితో ఆగకుండా ప్రతి ఆరు నెలలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎవరి సిఫారసులతో పని లేకుండా అర్హత కలిగిన వారందరికీ కొత్తగా పింఛన్లు మంజూరు చేసేది. ఆ విధంగా కొత్తపేట నియోజకవర్గంలోని 4 మండలాల్లో గత ఐదేళ్లలో సుమారు 8 వేల పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కొత్తపేట నియోజకవర్గంలో 43,214 మంది లబ్ధిదారులు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 4 మండలాల్లో 38,930 మంది, రాజోలు నియోజకవర్గంలోని 3 మండలాల్లో 30,558 మంది వివిధ సామాజిక పింఛన్లు తీసుకుంటున్నారు.

కొత్త పింఛన్ల కోసం ఎదురు చూపులు

గత ప్రభుత్వంలో అర్హుల నుంచి దరఖాస్తులను వలంటీర్లు తీసుకునేవారు. 'వైఎస్సార్ పింఛన్ కానుక' కింద పింఛన్ మంజూరయ్యే వరకూ అన్ని విధాలా సహకారం అందించేవారు. గత ప్రభుత్వ విధానం ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 1న కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. కానీ కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ అంశాన్ని గాలికొదిలేసింది. గత ప్రభుత్వంలో 'వైఎస్సార్ పింఛన్ కానుక'ను ఈ కూటమి ప్రభుత్వం 'ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్కీమ్' గా పేరు మార్చింది. కానీ కొత్త పింఛన్లు మాత్రం మంజూరు చేయలేదు. ఆయా నియోజకవర్గాల్లో దరఖాస్తు చేస్తుకుని అర్హత కలిగిన సుమారు 4000 మంది కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయా.. అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

ఓపెన్ కాని వెబ్‌సైట్

కొత్తగా పింఛన్ల నమోదుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సచివాలయాల్లో సిబ్బంది చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ 18న ఆగిన వెబ్ సైట్ కొత్తగా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన ఇంకా ఓపెన్ కాలేదు. నిరంతరం దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హులయితే పింఛన్ మంజూరయ్యేది. పింఛన్ల సొమ్మును కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వచ్చి అందించేవారు. కూటమి ప్రభుత్వంలో వలంటీర్లు లేరు. సచివాలయ ఉద్యోగులు నెలకు ఒక్కసారి పింఛన్లు ఇచ్చి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రజలకు ఏ అవసరం వచ్చినా సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు చాలా మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లకు ఇప్పటికే అర్హత సాధించారు. వీరందరూ దరఖాస్తులను చేత పట్టుకుని సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పింఛన్లలో అనర్హత పేరుతో చాలా మందిని తొలగించి వారి స్థానంలో కొత్తగా ఇచ్చేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతున్నట్లు సమాచారం.

వెంటనే మంజూరు చేయాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా కొత్త పింఛన్లు మంజూరు ప్రక్రియ నిర్వహించాలి. పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా ఇంతవరకూ సైట్ ఓపెన్ చేయకపోవడం దారుణం. దీని వల్ల చాలామంది అర్హులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఈ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసి, దరఖాస్తులు స్వీకరించి పేద, సామాన్య వర్గాలను ఆదుకోవాలి.

– నేలపూడి భీమరాజు, ఎంపీటీసీ, వాడపాలెం

ఎటువంటి సమాచారం లేదు



కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంతవరకూ ఎటువంటి సమాచారం రాలేదు. బహుశా వచ్చే నెలలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే నిబంధనల మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. గవర్నమెంట్ నిబంధనల ప్రకారం కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డీఎల్‌డీఓ, కొత్తపేట

క్లుప్తంగా

3 నుంచి శరన్నవరాత్రులు

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ వద్ద వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు వాసవీ వైశ్య సంఘ సభ్యులు తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవ శుభపత్రికలను ఆదివారం విడుదల చేశారు. 3న కన్యకాపరమేశ్వరిదేవి , 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణదేవి, 6న లలితాదేవి, 7న బాలాత్రిపుర సుందరీదేవి, 8న సరస్వతీదేవి, 9న మహాలక్ష్మిదేవి, 10న రాజరాజేశ్వరిదేవి, 11న మహిషాసురమర్దని, 12న విజయదుర్గాదేవి అలంకారాలు అమ్మవారికి చేయనున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు కాసు శ్రీనువాస్, కార్యదర్శి గోకవరపు శివ, కోశాధికారి బండాడ శివ తదితరులు తెలిపారు.

నదీతీరంలో కోత కలవరం


పెదపట్నంలంకలో గోదావరిలో పడిపోయిన కొబ్బరి చెట్లు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరంలో నదీపాతం రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది. ఇటీవల వచ్చిన గోదావరి వరదకు కోత ఉధృతి మించిందని తీర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం తీరాల్లో ఇటీవల వరదకు పెద్ద పెద్ద అండలుగా జారి గోదావరి నదిలో కూలిపోతున్నాయని తీర గ్రామాల వాసులు కలవరపడుతున్నారు. కొబ్బరి చెట్లు నదిలో పడిపోతున్నాయని వాపోతున్నారు. అప్పనపల్లిలో కోత నివాస గృహాలను సమీపించడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. జూలైలో వచ్చిన వరదతో పాటు ఇటీవల వచ్చిన వరదకు కోత విపరీతమైందని ఆవేదన చెందుతున్నారు. కోత నివారణకు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ మృతి

అంబాజీపేట: నందంపూడికి చెందిన ఆటో డ్రైవర్ రాయుడు శ్రీను (48) ఆకస్మిక మృతికి సంతాపంగా అంబాజీపేట సిద్ధి వినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆటోలు బంద్ పాటించారు. శ్రీను మృతికి పలువురు ఆటో డ్రైవర్‌లు, సంఘ సభ్యులు సంతాపం వ్యక్తం చేసి అతని ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు.

చెరువును తలపిస్తున్న రహదారి


కె.పెదపూడిలో చెరువులా ఉన్న రహదారి

అంబాజీపేట: కొద్దిపాటి వర్షానికే కె.పెదపూడిలో ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండి పోవడంతో దోమలకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షపు నీరు దిగేందుకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఓఎన్జీసీ ఏర్పాటు చేసే సమయంలో రావులమ్మ ఆలయం పక్కనే ఉన్న ప్రధాన రహదారిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్న అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ బీసీ, సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా సంసాని రామకృష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శంకరరావు నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు రామకృష్ణ ఆదివారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై రాష్ట్ర నాయకులకు, ప్రముఖులకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి అంకిత భావంతో పని చేసి సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

విజయభారతి మృతి తీరని లోటు

మామిడికుదురు: ప్రముఖ రచయిత, డాక్టర్ విజయభారతి శనివారం హైదరాబాద్‌లో మృతి చెందడం తీరని లోటని పలువురు వక్తలు ప్రస్తుతించారు. మామిడికుదురు బోయి భీమన్న స్మారక భవనం ప్రాంగణంలో భీమన్న విగ్రహం వద్ద విజయభారతి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విజయ భారతి బోయి భీమన్న కుమార్తె. ఆమె రచయితగా చేసిన సేవలను కొనియాడారు. మామిడికుదురు షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం, అభ్యుదయ భీమ్ సాహితీ సంస్థ, అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కలిగితి పళ్లంరాజు, కార్యదర్శి మట్టా సత్తిబాబు, భీమ్ సాహితీ అధ్యక్షుడు పాలమూరి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా నిలిచిన పశువుల ఆస్పత్రి


ముక్కామలలో అసంపూర్తిగా నిలిచిన పశువుల ఆస్పత్రి

అంబాజీపేట: మూగజీవులకు వైద్య సేవలందించేందుకు ముక్కామలలో నిర్మిస్తున్న పశువుల ఆస్పత్రి అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుత నిర్వహిస్తున్న భవనం శిథిలస్థితికి చేరడంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. భవనంపై రేకులు పగిలిపోయి వర్షపునీరు గదుల్లోకి చేరుతుంది. అంతేకాకుండా విషసర్పాలకు నిలయంగా మారింది. పశువుల వైద్యం కోసం తెచ్చిన మందులు, రికార్డులు భద్రపరచుకునేందుకు అనుకూలంగా లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ సమయంలో భవనం కూలిపోతుందోనని భయాందోళనకు గురవుతూ విధులు నిర్వహిస్తున్నారు. దాంతో గత ఏడాది నాబార్డు నిధులు రూ.32 లక్షలతో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. స్లాబ్ లెవెల్ వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు చొరవ చూపించకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత భవన నిర్మాణ కాంట్రాక్టర్‌కు చేసిన పనికి నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా గాలికొదిలేశారని స్థానికులు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉన్న పశువుల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన శ్రీమద్రామాయణ ప్రవచనాలు


అంబాజీపేటలో శ్రీరామ పట్టాభిషేకం చేస్తున్న రవికుమార్ దంపతులు

అంబాజీపేట: గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచనాలు ఆదివారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకంతో ముగిశాయి. స్థానిక పెద్ద వీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 22 నుంచి శ్రీమద్రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమ ప్రవచన కర్త శ్రీనివాస రామనుజదాసు ప్రవచనాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రవచనాల ముగింపు సందర్భంగా నిర్వాహకులు అప్పన రవికుమార్, రేవతి దంపతులు శ్రీరామపట్టాభిషేకం నిర్వహించారు. ప్రముఖ వేద పండితుడు సుసర్ల బుజ్జి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం రామనుజదాసు మాట్లాడుతూ శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించడం వల్ల శుభాలు జరుగుతాయని పేర్కొన్నారు. రామనుజదాసును నిర్వాహకులతో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పన వాసు, బాలాజీ, ప్రభాకర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై అక్రమ నిర్మాణం


రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షెడ్డు

రావులపాలెం: నిబంధనలకు విరుద్ధంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రావులపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కొందరు ఆదివారం అక్రమ షెడ్డు నిర్మాణానికి తెరతీశారు. రావులపాలెం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి అయిన ఆర్అండ్‌బీ రోడ్డుపై స్థానిక పెద్ద ఆంజనేయస్వామి గుడి సమీపంలో కాలువ గట్టున ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా రోడ్డుపై ఈ షెడ్డును నిర్మిస్తున్నారు. అయితే ఇది తాత్కాలికంగా కాకుండా పటిష్టంగా ఐరన్ పైపులు, ఐరన్ రాడ్లతో వెల్డింగ్ చేసి రోడ్డుపై వేయడంతో, నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అక్రమ నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై చర్యలు తీసుకోవడంతో పాటు షెడ్డు తొలగింపునకు కిందస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

ఆలయం, ఎరువుల దుకాణంలో చోరీలు


ఎరువుల షాపులో చోరీ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి సీసీ ఫుటేజీ

అంబాజీపేట: మండలంలో వరుస చోరీలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. అంబాజీపేటలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కనకదుర్గమ్మ ఆలయంలోను, ఎరువుల దుకాణంలో చోరీలు జరిగాయి. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న తేలుగుంట్ల మాచరరావు (రాజు)కు చెందిన విజయలక్ష్మి ఏజెన్సీ ఎరువులు, పురుగు మందుల షాపుకు వెనుక ఉన్న గొడౌన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి లోపలకు ప్రవేశించి రూ.70 వేల నగదును అపహరించుకుపోయాడు. షాపులో ఉన్న క్యాష్ కౌంటర్‌లో నగదును గుర్తు తెలియని వ్యక్తి తీస్తున్నట్లుగా సీసీ ఫుటేజీలో నమోదయిందని షాపు యజమాని రాజు తెలిపారు. అలాగే షాపునకు కూత వేటు దూరంలో వీరభద్ర థియేటర్ సమీపాన ఉన్న విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం చోరీ గురైంది. గుడిలో ఉన్న ధర్మ డిబ్బీని పగలగొట్టి అందులో ఉన్న రూ.5 వేల నగదును అపహరించుకుపోయారు. చోరీ జరిగిన రెండు ప్రాంతాలను పోలీసులు పరిశీలించారు.

నిత్యన్నదానానికి విరాళం


దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ముంబైకి చెందిన బోనం మెహర్ శైలజ దంపతులు రూ.25,001 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును దాత ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు రోటరీ సత్కారం


రోటరీ క్లబ్ సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో రొటేరియన్లు

రాజోలు: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వేర్వేరు పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను రొటేరియన్లు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు రోటరీ క్లబ్ కార్యాలయంలో జరిగిన సభలో ఉపాధ్యాయులైన ఓలేటి అన్నపూర్ణ, కాత్రు శకుంతల, ఎస్.రఘురామయ్య, కేవీ సత్యనారాయణ మూర్తి, గెద్దాడ నాగలక్ష్మిలను క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాసరావు శాలువాలతో ఘనంగా సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కోదాడి సోమరాజు, కోశాధికారి నామన షణ్ముఖ్, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ బీవీ తిరుమలరావు, దార్ల పెదబాబు, కసుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మలికిపురం: నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైనన సీఎం సహాయ నిధి చెక్కులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం ఆయన నివాసం వద్ద పంపిణీ చేశారు. రాజోలు మండలం సోంపల్లికి చెందిన ఉండ్రు జాన్‌బాబుకి మంజూరైన సొమ్ము రూ.33 వేలు, కరవాకకు చెందిన సందాడి నాగవేణికి మంజూరైన సొమ్ము రూ.85 వేలు, రాజోలు చెందిన ప్రీతికి మంజూరైన సొమ్ము రూ.2,09,716 చెక్కులను ఆయన అందించారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర పూజలు


స్వామికి నిర్వహిస్తున్న అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

'వీధి'కి సత్కారం


దుర్గారావును సత్కరిస్తున్న తెలుగు జాతీయ సదస్సు నిర్వాహకులు

అయినవిల్లి: రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన తెలుగు జాతీయ సదస్సులో మండలంలోని చింతనలంక జెడ్పీ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు వీధి దుర్గారావును సత్కరించారు. 'శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి రచనలు– ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం' అనే అంశంపై వీధి దుర్గారావు రచించిన రచనకు గాను ఈ అవార్డు అందించారు. నిర్వాహకుడు తరపట్ల సత్యనారాయణ, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయ్ కుమార్ చేతుల మీదుగా దుర్గారావుని ఘనంగా సన్మానించారు.

దశమికి సిద్ధమవుతున్న చలువ పందిళ్లు


అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద సిద్ధమవుతున్న చలువ పందిరి

అమలాపురం టౌన్: విజయ దశమి ఉత్సవాలకు పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద చలువ పందిళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఏటా దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఆలయం వద్ద రూ.లక్షలతో సినిమా సెట్టింగ్స్ మాదిరిగా తీర్చిదిద్దుతున్నారు. ముస్లిం స్ట్రీట్ వైపు పందిరి ముఖ ద్వారం వద్ద దాదాపు 60 అడుగుల ఎత్తులో ఓ ఆలయం సెట్టింగ్ నిర్మిస్తున్నారు. అలాగే కుంకాల సందు వైపు, శ్రీరామపురం వైపు కూడా పందిరి ముఖ ద్వారాలను సెట్టింగ్‌లతో తీర్చిదిద్దుతున్నారు. ఇక పందిరి లోపల ఓ భవంతిలోకి ప్రవేశించిన అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 16న శ్రీదేవి అమ్మవారి భారీ నిమజ్జన ఊరేగింపును, ఆలయం 45వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక గోఖలే సెంటర్‌లోని కనకదుర్గ ఆలయం, కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనకదుర్గ ఆలయం, నారాయణపేట, సూర్యనగర్, కొంకాపల్లి, వెత్సావారి అగ్రహారం, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాల వద్ద దశమికి చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లవిల్లి విద్యార్థులు


దివ్యభాను


మౌనిక

ఉప్పలగుప్తం: స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-17లో భాగంగా రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ గొలకోటి ఫణీంద్ర తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నూకల రేవతి దివ్యభాను హాకీ, దోనిపాటి మౌనిక ఫుట్‌బాల్ ఆదివారం జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో తమ ప్రతిభను కనబరిచారన్నారు. రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగాల్లో జరిగే ఆటల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని పీడీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, హెచ్ఎం రాణి, పీడీలు డి.సరస్వతి, వి.విజయభాస్కర్ అభినందించారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


అంబాజీపేటలో డీసీసీబీ డిపాజిట్లపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి శ్రీనివాస్

అంబాజీపేట: డీసీసీబీ అందిస్తున్న డిపాజిట్లు, అతి తక్కువ వడ్డీకే రుణాలను ప్రతి రైతు, వినియోగదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోభివృద్ధి చెందాలని డీసీసీబీ నోడల్ అధికారి పి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేటలో డీసీసీబీ అందిస్తున్న సేవలు, డిపాజిట్లపై ఆదివారం క్యాంపెయిన్ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు నేస్తం స్కీమ్ ద్వారా ఎకరానికి రూ.8 లక్షల చొప్పున రుణాన్ని అందిస్తున్నారన్నారు. అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నామన్నారు. చిన్న మొత్తాల పొదుపు డిపాజిట్లు సదుపాయం ఉందని ఖాతాదారులుగా చేరి వినియోగించుకోవాలన్నారు. సేఫ్ డిపాజిట్ లాకర్ సదుపాయం, గృహ రుణాల మరమ్మతులకు రుణాలు ఇస్తున్నామన్నారు. అనంతరం డిపాజిట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ బి.నాగేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ సత్య, అంబాజీపేట, చిరతపూడి సీఈఓలు కుంపట్ల అయ్యప్పనాయుడు, భీమరాజు, సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు.

రైసు మిల్లర్ల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్


చుండ్రు శ్రీనివాసు

ఆలమూరు: మండలంలోని మోదుకూరుకు చెందిన వ్యాపారవేత్త చుండ్రు శ్రీనివాస్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గతంలో కొత్తపేట నియోజకవర్గ రైసుమిల్లర్స్ అసోసియేషన్‌లో కీలకంగా వ్యవహరించి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. దీంతో శ్రీనివాస్ సేవలను గుర్తించిన రైసుమిల్లర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గంలోకి తీసుకుని ఉపాధ్యక్షుడిగా కీలక బాధ్యతలను అప్పగించింది. శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

రాష్ట్రపతికి హైవే బాధితుల అర్జీ


పాశర్లపూడి హైవే బాధితులు

మామిడికుదురు: పాశర్లపూడిలో 2014 అలైన్‌మెంట్ ప్రకారం చేయవలసిన రోడ్డు నిర్మాణ పనుల్ని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రలోభాలకు గురయ్యారని బాధితులు వాపోయారు. అధికారులు ఆశపడి అలైన్‌మెంట్ మార్చారని ఆరోపిస్తూ బాధితులు రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు అర్జీ పెట్టుకున్నారు. రెండు మూడు కుంచాలు భూములున్న పేద రైతుల పొలాల నుంచి హైవే వేయడం అన్యాయం అంటూ విన్నపంలో పేర్కొన్నారు. తామంతా పేద రైతులమని తమ స్థలాల నుంచి జాతీయ రహదారి వేస్తే పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రపతి వెంటనే దీనిపై స్పందించి పేదల గోడు వినిపించుకోవాలని, రోడ్డు నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరిపించాలని అభ్యర్థించారు. గతంలో అర్జీ పెట్టుకున్న బాధితులు తాజాగా మరో అర్జీ పెట్టుకున్నారు.

ర్యాలి ఆలయ ఈవోగా రమణమూర్తి


రమణమూర్తి

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ఈవోగా బీహెచ్‌వీ రమణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య 5 సంవత్సరాలు పూర్తి కావడంతో కపిలేశ్వరపురం బదిలీపై వెళ్లారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో ఆలయ నిర్వాహకుడు శ్రీ సుందర శ్రీనివాసదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం స్వామికి సుందర శ్రీనివాస్‌దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఆయన భక్తులకు శ్రీకృష్ణుని జన్మవృత్తాంతాన్ని వివరించి పారాయణ చేశారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభుపతి దాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం


శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో బహుళ ద్వాదశి సందర్భంగా స్వామి వారి శాంతి కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.